సాక్షి ప్రకాశం

బుధవారం । 1 । జనవరి । 2025

I



నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఒంగోలులోని బీకే ఎన్‌క్లేవ్‌లో ఉత్సాహంగా నృత్యం చేస్తున్న యువతులు

గరిష్టం/కనిష్టం
30/22

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

హైందవ శంఖారావం జయప్రదం చేయండి

ఒంగోలు సిటీ: చలో విజయవాడ జనవరి 5న జరిగే హైందవ శంఖారావం బహిరంగసభను జయప్రదం చేయాలని హైందర శంఖారావం సహ కన్వీనర్ కె.వెంకటేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైందవ శంఖారావం సందర్భంగా జనవరి 3వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ముంగమూరు రోడ్డులోని మర్రి చెట్టు దగ్గర ఆంజనేయస్వామి దేవాలయం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. వేలాదిగా తరలివచ్చి ఈ బైక్‌ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా రామచంద్రరావు



మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పి రామచంద్రరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. పలువురు డాక్టర్లు ఆయనను కలిసి అభినందించారు.



కొత్తగా.. రెక్కలొచ్చెనా..!

యువత ఉత్సాహం ఉరకలేస్తోంది. గడచిన ఏడాది ఇచ్చిన మధుర స్మృతులను గుండెనిండా పదిలంగా ఉంచుకుంటూ..కొంగొత్త ఆశలు, భవిష్యత్ ప్రణాళికలతో ముందుకు సాగే ఆనంద కేళి. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా కొత్త సంవత్సర హడావుడే. గడియారంలో సమయం 12 గంటలు దాటిన వెంటనే నూతన సంవత్సర వేడుకల సంబరాలు అంబరాన్నంటాయి. 2024కి వీడ్కోలు పలుకుతూ 2025కి గ్రాండ్ వెల్‌కమ్ పలికారు జిల్లా వాసులు..

- ఫొటో: ఎం.ప్రసాద్, సాక్షి, ఒంగోలు

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఒంగోలు సిటీ: ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వై.వీ.సుబ్బారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున, మాజీ ఎమ్మెల్యేలు గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కేపీ నాగార్జున రెడ్డి, అన్నా రాంబాబు, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ ఉన్నారు. రాబోయే 2025 నూతన సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలని, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు.

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించనున్నట్లు ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు 2025 నూతన సంవత్సరం సందర్భంగా 50 కేజీల కేక్ కట్ చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కోతల నామ సంవత్సరం

క్రోధి నామ సంవత్సరాన్ని కూటమి సర్కారు కోతల నామ నామ సంవత్సరంగా మార్చేంది. అధికారం కోసం అలవి కాని అడ్డమైన హామీలిచ్చి.. ఆ తర్వాత సంక్షేమ పథకాలకు కోతలు పెట్టింది. ఏడాది ఆరంభం నుంచి తొలి ఆరు నెలల వరకు ప్రజలు సంక్షేమ పథకాలతో సంతోషంగా గడిపారు. ఎన్నికల సమయంలో ఆకాశంలో చంద్రుడ్ని తీసుకొచ్చి చేతుల్లో పెడతామని ఊరించారు. తాము అధికారంలోకి వస్తే అంతన్నారు.. ఇంతన్నారు. సూపర్ సిక్స్ అంటూ హామీలిచ్చారు. అధికారం దక్కాక ఒట్టి చేతులు చూపించారు. కనీసం ఒక్క సంక్షేమ పథకం కూడా అందక జిల్లా వాసులు నిరాశగా బేలచూపులు చూస్తున్నారు.



- సంక్షేమానికి చెల్లుచీటి పాడిన కూటమి సర్కార్
- అమలుకు నోచుకోని సూపర్ సిక్స్
- గ్యాస్ కొందరికే..
- అర్హత పేరుతో పింఛన్లకు భారీ కోత
- ఊసేలేని తల్లికి వందనం
- ఉచిత బస్సు ఉల్టా


సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి పాలకులు గద్దెనెక్కి ఆరునెలలు గడిచిపోయాయి. ఈ ఆరునెలల్లో చేసిందేమీ లేదు. గతంలో ఇంటి దగ్గరకు తెచ్చి ఇస్తున్న పింఛన్‌కు కొర్రీలతో కోతలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. మహిళలందరికీ ఉచితంగా వంట గ్యాస్ ఇస్తామని చెప్పి ఊరూరా తిరిగి దండోరా వేశారు. తీరా అందరికీ కాదు కొందరికి మాత్రమే అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇక విద్యా సంవత్సరం ప్రారంభమై ఏడు నెలలు గడుస్తున్నా తల్లికి వందనం ఊసే లేదు. ఎందుకని అడిగితే సమాధానం చెప్పే వారే లేరు. నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 పథకాలు నీటిమీది రాతలుగా మిగిలిపోయాయి. ఇక మహిళలకు ఉచిత బస్సు ఎప్పుడు మొదలవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను ఎలా ఎగ్గొట్టాలన్న ఆలోచన తప్పించి ఇచ్చిన మాటను నిలుపుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. సూపర్ సిక్స్ అంటూ గొప్పలు చెప్పుకోవడం తప్పించి కనీసం ఒక్క పథకం కూడా పక్కాగా అమలుకు నోచుకోలేదు. నమ్మి ఓట్లేసిన జిల్లా ప్రజల నోట మట్టి కొట్టిన కూటమి పాలకులు రోజుకో నాటకంతో నెట్టుకొస్తున్నారు.

పింఛన్ల భారీ కోతకు రంగం సిద్ధం...

ఎన్టీఆర్ భరోసా పేరుతో ప్రతి నెలా ఇచ్చే పింఛన్లు పెంచుతామని గత ఎన్నికల్ల చంద్రబాబు హామీ ఇచ్చారు. సామాజిక పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్లు రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని నమ్మబలికారు. జనం నిజంగా ఇస్తారని అనుకున్నారు. అయితే అధికారంలోకి వచ్చిందే తడవుగా పింఛన్లలో కోత విధించేందుకు కుట్రలు మొదలు పెట్టేశారు. దివ్యాంగుల పింఛన్లలో అక్రమాలు జరిగాయంటూ తప్పుడు ప్రచారానికి తెరతీశారు. పింఛన్లపై ఫిర్యాదులకు అవకాశం కల్పించారు. అప్పటికీ పెద్దగా ఫిర్యాదులు రాకపోవడంతో రెండు రోజుల పాటు అధికారులు విచారణ చేయాలంటూ ఆదేశాలు ఇచ్చారు. దీంతో పింఛన్ మీద ఆధారపడిన నిరుపేద ప్రజలు ఆవేదనకు గురవుతున్నారు. జిల్లాలో 2,85,438 పింఛన్లు ఉన్నాయి. 33,863 మందికి దివ్యాంగుల పింఛన్లు ఉన్నాయి.

కొందరికే ఉచిత గ్యాస్...



ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని గత ఎన్నికల్లో ప్రచారం చేశారు. ఇదంతా నిజమేనని మహిళలు నమ్మారు. దీపావళి పండగ నాడు ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు హడావుడి చేశారు. అందరికీ ఇస్తామన్న వంట గ్యాస్ కొందరికే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. గ్యాస్ బుక్ చేసుకున్న 48 గంటల్లో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పిన కూటమి పాలకులు కొందరికి మాత్రమే డబ్బులు వేశారు. బ్యాంకుల్లో డబ్బులు జమ కాని లబ్ధిదారులకు జవాబు చెప్పే వారు కూడా లేకుండా పోయారు. దీంతో ఈ విషయంలో ఎవరిని అడగాలో తెలియక తికమక పడుతున్నారు. జిల్లాలో 6,56,738 వంట గ్యాస్ కలెక్షన్లు ఉండగా వాటిలో కేవలం 2,63,019 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు. వాటిలో కూడా కేవలం 2,57,787 మందికి మాత్రమే నిధులు మంజూరు చేశారు. వాటిలో సుమారుగా 2,51,659 మందికి మాత్రమే ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చారు. మిగిలిన 4,04,719 మందికి ఉచిత గ్యాస్ ఇవ్వకుండా మొండిచేయి చూపారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొరాయిస్తున్న ఉచిత బస్సు




అధికారంలోకి వచ్చిన వెంటనే కర్ణాటక తెలంగాణా తరహాలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఆ తరువాత ఏడు నెలలు ఉత్తి మాటలతో గడిపేశారు. ఉచిత బస్సు పథకం అమలు చేయాలంటే కొత్త బస్సులు కొనాలని, డ్రైవర్లను, కండక్టర్లను నియమించాల్సి ఉంటుందని ప్రచారం చేశారు. ఆర్టీసీ బస్సులు ఇప్పుడిక వచ్చే ఏడాది ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తామంటూ కొత్త పాట పాడుతున్నారు. దీనికి ఎన్ని కొర్రీలు పెడతారోనంటూ మహిళలు గుసగుసలాడుకుంటున్నారు. జిల్లాలో 11,02,821 మంది మహిళలు ఉన్నారు. వీరందరికీ ఉచిత బస్సు పథకం వర్తించాల్సి ఉంది. అయితే ఎంత మంది టికెట్లు చించేస్తారో వేచి చూడాల్సిందే..

వందనం కాదు ఎగనామం...




ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమ్మ ఒడి పథకంపై విమర్శలు గుప్పించడంతో ప్రజా వ్యతిరేకత వచ్చింది. దాంతో వెనక్కి తగ్గిన చంద్రబాబు తల్లికి వందనం పేరుతో అమ్మ ఒడి పథకాన్ని కొనసాగిస్తామని ప్రచారం చేశారు. నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు నీకు రూ.15 వేలు అంటూ కూటమి నేతలు ఇచ్చిన హామీ బాగా ప్రాచుర్యం పొందింది. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తలా రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఏడాది ఇవ్వలేమంటూ చేతులెత్తేశారు. జిల్లాలో 2,89,783 మంది చిన్నారుల చదువులకు పెద్ద గండమే వచ్చి పడింది. ఫీజులు కట్టలేక అనేక మంది పిల్లల తలిదండ్రులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అసలే అతివృష్టి, అనావృష్టితో చేయడానికి పనులు లేక అల్లాడిపోతున్న గ్రామీణ ప్రజలు పిల్లలను చదివించేందుకు అప్పులు చేయాల్సిన దుస్థితి దాపురించిందని వాపోతున్నారు.

అన్నదాతకు మొండిచేయి...



అన్నదాత సుఖీభవ అంటూ అన్నంపెట్టే రైతులకు ఆశలు కల్పించిన కూటమి నాయకులు ఇప్పుడు వారికి మొండిచేయి చూపారు. జిల్లాలో 2,96,889 మంది రైతులకు ప్రతి ఏడాది రైతు భరోసా ఇచ్చి నాటి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదుకోగా నేటి కూటమి పాలకులు ఒక్క నయా పైసా ఇవ్వకుండా దగా చేసిందని రైతు సంఘాలు మండిపడుతున్నాయి. అంతేకాకుండా వాట్సప్‌లో పెడితే చాలు ఇంటి దగ్గరకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తామంటూ ఎల్లో మీడియాలో ప్రచారం చేస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. నామ మాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దళారుల ద్వారా అరకొర కొనుగోళ్లు చేస్తోంది. గిట్టుబాటు ధర ఇవ్వకుండా ఇష్టం వచ్చిన ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతు కష్టాన్ని దోపిడీ చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రతి మహిళకు రూ.1500 ఎప్పుడు...?



జిల్లాలో 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలనెలా రూ.1500 ఇస్తామని ఆర్భాటంగా ప్రచారం చేశారు. చివరికి 7 నెలలవుతున్నా ఒక్క రూపాయి ఇవ్వలేదు సరికదా దానికి సంబంధించిన విధి విధానాలు కూడా విడుదల చేయలేదు. అసలు ఆ పథకం గురించి ఎక్కడా మాట్లాడడం లేదు. జిల్లాలో 7,00,012 మంది ఈ పథకం ఎప్పుడు అమలు చేస్తారని ఎదురు చూస్తున్నారు. దీనికి చెల్లించాల్సింది రూ.1,05,00,18,000 . ఈ డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని మహిళలు అడుగుతున్నారు.

రాష్ట్ర స్థాయి క్యారమ్స్ విజేతలుగా ఓరియంటల్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి క్యారమ్స్ విజేతలు

ఒంగోలు: స్థానిక గద్దలగుంటలోని పింగళి కోదండ రామయ్య సంస్కృతాంధ్ర ఓరియంటల్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో క్యారమ్స్ విజేతలుగా నిలిచారు. ఈనెల 22, 23 తేదీల్లో సింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్ 14, అండర్ 17 స్కూల్‌గేమ్స్ పోటీల్లో వీరు పాల్గొని మెడల్స్ సాధించారు. కార్యక్రమంలో పతకాలు సాధించిన షేక్ మస్తాన్, టి.గంగోత్రి (స్వర్ణ), కె.సిద్దూ, జి.రాజేష్ (రజత), కె.అగన్య, జి.సాయి (కాంస్య)ని కరస్పాండెంట్ కోటి సూర్యనారాయణ పాఠశాల ఉపాధ్యక్షుడు చలపతిరావు, పీఈటీ సురేష్, భారతీయ వికాస పరిషత్ సభ్యులు చక్రవర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

- చిన్నమార్పులతో మంచి ఫలితాలు సాధిస్తా
- సబ్‌కలెక్టర్ త్రివినాగ్



సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: మార్కాపురం డివిజన్ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు సబ్‌కలెక్టర్ త్రివినాగ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాలు, ఆలోచనలను తెలిపారు. రెవెన్యూ వ్యవస్థలో చిన్న చిన్న మార్పులు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని అనుకుంటున్నామన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద జలాశయంగా గుర్తింపు పొందిన, యునెస్కో ద్వారా వారసత్వ జలాశయంగా పేరొందిన కంభం చెరువు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. సుమారు రూ.1.3 కోట్లతో అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కంభం చెరువును చారిత్రాత్మక, పర్యాటక ప్రదేశంగా ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. చరిత్ర విశేషాలు తెలిపే మ్యూజియంను ఏర్పాటుచేస్తే బాగుంటుందన్నారు. కంభం చెరువులో బోటింగ్ ప్రతిపాదన కూడా ఉందన్నారు. దీంతోపాటు మార్కాపురంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం పక్కన ఉన్న కెనాల్‌ను కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మార్కాపురం పట్టణంలో ఆక్రమణలను తొలగించడంతోపాటు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడుతున్నామన్నారు. త్వరలో కాలేజీ రోడ్డు చివర వై జంక్షన్ వద్ద ప్రజలందరూ గుర్తుపెట్టుకునేలా 'ఐ లవ్ మార్కాపురం' అనే బోర్డును ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. పశ్చిమ ప్రకాశంలో జరిగే పెద్ద కార్యక్రమాలు, ఉత్సవాలు, తెప్పోత్సవాల సమయంలో డ్రోన్ కెమెరాలు వినియోగిస్తామన్నారు. మూడు కెమెరాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. డివిజన్‌లోని తహశీల్దార్ల పనితీరు, ప్రజలు, అధికారులతో నిర్వహిస్తున్న సంబంధాలు, సమస్యల పరిష్కారాన్ని పరిశీలించి ప్రతినెలా బెస్ట్ తహశీల్దార్ అవార్డును కూడా ప్రవేశపెట్టానన్నారు. ప్రతి తహశీల్దార్ కార్యాలయాన్ని ఆధునికీకరించడంతోపాటు రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తున్నామన్నారు.

న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు

- జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజులు మన రాష్ట్రంలో కడప, అనంతపురం, గుంటూరు జిల్లాల్లో న్యాయవాదుల మీద జరిగిన భౌతిక దాడులను తీవ్రంగా ఖండిస్తూ, న్యాయవాదులకు తగిన రక్షణ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కడప జిల్లా, గాలివేడు మండలానికి చెందిన సీనియర్ న్యాయవాది జల్ల సుదర్శన్ రెడ్డిపై, అనంతపురం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ లో శేషాద్రి అనే సీనియర్ న్యాయవాది పై సివిల్ వివాదంలో విచారణ పేరుతో వేధించి మృతికి కారణం అయిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పొన్నూరు బార్ అసోసియేషన్ సభ్యుడు బేతాళ ప్రకాష్ అనే న్యాయవాది పై విచక్షణా రహితంగా పొన్నూరు టౌన్ పోలీస్‌స్టేషన్ లో అక్రమంగా నిర్బంధించి థర్డ్ డిగ్రీని ప్రయోగించి న్యాయవాది సంఘాలు కూడా నివ్వెరపోయేలా పొన్నూరు టౌన్ ఎస్సై రాజ్‌కుమార్ వ్యవహరించిన తీరు దుర్మార్గమని విమర్శించారు. ఇలా న్యాయవాదుల పై జరుగుతున్న దాడులకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బార్ అసోసియేషన్‌లు విధులు బహిష్కరించి సంఘీభావం తెలిపినట్లు చెప్పారు. ఒంగోలు బార్ అసోసియేషన్‌లోని న్యాయవాదులు విధులు బహిష్కరించారు. న్యాయవాదులపై దాడులకు కారణమైన పోలీసు అధికారులను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, న్యాయవాదులు ధర్నాసి హరిబాబు, కాటుకూరి బాబురావు, గంగవరపు ప్రవీణ్‌కుమార్, పి.వి.రాఘవరావు, కె.స్వామిరెడ్డి, షేక్ హిదయతుల్లా, గాయం సావిత్రి, తోట సుధారాణి, నీలం పద్మలత, ఆడే రామసుబ్బారావు, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.







హిమ సింధువు

ఒంగోలు నగరంతోపాటు పరిసర ప్రాంతాలు లంబసింగిని తలపించాయి. సోమవారం అర్ధరాత్రి నుంచే దట్టంగా కమ్మేసిన పొగమంచు.. మంగళవారం వేకువజామున ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేసింది. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడకపోవడంతో చలి వాతావరణంలోనే జనం తమ రోజువారీ కార్యకలాపాలను కొనసాగించారు. – సాక్షి, ఒంగోలు





క్లుప్తంగా

జర్నలిస్టుల అక్రెడిటేషన్ గడువు పొడిగింపు

ఒంగోలు అర్బన్: జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువు ముగిసిన నేపథ్యంలో మరో రెండు నెలలు కాల పరిమితి పొడిగిస్తున్నట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి పి.వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అక్రెడిటేషన్ కార్డుల గడువు 2025 జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు లేదా ఈలోగా కొత్త కార్డు జారీ చేస్తే అప్పటి వరకు గడువు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఆ మేరకు అక్రెడిటేసన్ కార్డులపై గడువు పొడగింపు తేదీతో నూతనంగా స్టిక్కర్ అతికిస్తామని తెలిపారు. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండో రోజు 249 మంది హాజరు

- పోలీసు దేహదారుఢ్య పరీక్షల్లో 176 మంది క్వాలిఫై



రన్నింగ్‌లో సత్తా చాటుతున్న అభ్యర్థులు

ఒంగోలు టౌన్: పోలీసు శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు మంగళవారం రెండో రోజు ఉదయం 5 గంటల నుంచి కవాతు పరీక్షలు కొనసాగాయి. మొత్తం 600 మంది అభ్యర్థులకుగాను 249 మంది హాజరయ్యారు. వారిలో 176 మంది క్వాలిఫై అయినట్లు అధికారులు తెలిపారు. ఈవెంట్స్‌లో ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, పీటీసీ డీఎస్పీ లక్ష్మణ్ కుమార్, డీపీఓ ఏఓ రామ్మోహనరావు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ నగదు చోరీ

- రికవరీతో ఊపిరి పీల్చుకున్న సచివాలయ సిబ్బంది

కురిచేడు: పింఛన్ నగదు పంపిణీ సమయంలో రూ.74 వేలు చోరీకి గురైన సంఘటన మండలంలోని పొట్లపాడు సచివాలయంలో మంగళవారం జరిగింది. వివరాలు.. డిజిటల్ అసిస్టెంట్ ఆర్.రాంబాబు పొట్లపాడు గ్రామానికి చెందిన చలంచర్ల బాల అంకమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేసేందుకు సచివాలయం నుంచి బయటకు వచ్చి అరుగుపై కూర్చున్నాడు. బాల అంకమ్మకు తోడుగా ఆమె కుమారుడు యోగయ్య కూడా వచ్చాడు. ఆ సమయంలో డీఏ రాంబాబు ఫోన్ రింగ్ కావటంతో నగదు సంచిని అరుగుపై వదిలేసి సచివాలయంలోని తన గదిలోకి ఫోన్ కోసం వెళ్లాడు. బాల అంకమ్మ కుమారుడు యోగయ్య నగదు సంచి తీసుకుని ఉడాయించాడు. రాంబాబు బయటకు వచ్చే సరికి యోగయ్యతో పాటు నగదు సంచి లేక పోవడంతో అనుమానం వచ్చిన రాంబాబు మిగిలిన సిబ్బందిని, పంచాయతీ కార్యదర్శి వివేక్‌ను పిలిచి జరిగిన విషయం తెలిపాడు. పోలీసులకు సమాచారం ఇచ్చి గ్రామంలో యోగయ్య కోసం వెతికారు. సెంటర్‌లో ఉన్న యోగయ్యను తీసుకొచ్చి గట్టిగా అడగడంతో సచివాలయం వెనక చెట్లలో పేపర్లో చుట్టిపెట్టిన నగదు తెచ్చి ఇచ్చాడు. దీంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

కమిషనర్.. పద్ధతి మార్చుకోండి

- మున్సిపల్ కౌన్సిలర్లపై మీ పెత్తనమేంటి?
- చీమకుర్తి పురపాలనలో ఇతరుల జోక్యం తగునా?
- పాలకవర్గానికి తెలియకుండా అజెండా ఎలా తయారు చేస్తారు?
- కౌన్సిలర్లకు కనీస మర్యాద కూడా ఇవ్వరా?
- కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల ఆగ్రహం



కమిషనర్‌ను నిలదీస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

చీమకుర్తి: 'ప్రజలకు సక్రమంగా మంచినీటిని అందిస్తున్న వాటర్ ప్లాంట్లను మూతేశారు. పాలకవర్గం తీర్మానం లేకుండానే వాటిని మీ ఇష్టమొచ్చిన వారికి ఇస్తున్నారు. కార్యాలయంలోకి బయటి వాళ్లు ఎవరో వచ్చి హాజరు వేస్తున్నారు. పాలకవర్గం అనుమతి లేకుండానే అజెండా తయారు చేస్తున్నారు. ఇలాగైతే ఊరుకునేది లేదు కమిషనర్ గారు. పద్ధతి మార్చుకోండి. కౌన్సిలర్లపై మీ పెత్తనమేంటి' అని చీమకుర్తి కమిషనర్ వై.రామకృష్ణయ్య తీరుపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు బీమన వెంకట్రావు, తప్పెట బాబూరావు, సోమా శేషాద్రి, పాటిబండ్ల గంగయ్య ధ్వజమెత్తారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడు నెలల నుంచి కమిషనర్ వ్యవహరిస్తున్న తీరుపై కౌన్సిలర్లు నిప్పులు చెరిగారు. గత నెలలో పాలకవర్గ సమావేశం ఎందుకు పెట్టలేదని నిలదీశారు. ప్రస్తుత సమావేశంలో పెట్టిన అజెండాలోని అంశాలను కౌన్సిలర్‌కు తెలియకుండా ఎలా తయారు చేస్తారని ప్రశ్నించారు. మీ ఇష్టమొచ్చినట్లు అజెండాలోని అంశాలను తయారు చేసుకొని వచ్చి సమావేశంలో పెడితే ఎలా ఆమోదిస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే అజెండాను రద్దు చేస్తున్నామని చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి కౌన్సిలర్ల సూచన మేరకు ప్రకటించారు.

కౌన్సిలర్లకు కనీస మర్యాద లేదు

ఓట్లేసిన ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వస్తే కనీస మర్యాద, గౌరవం ఇవ్వడం లేదని కమిషనర్ తీరుపై కౌన్సిలర్లు మండిపడ్డారు. పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బును ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. వీధి వ్యాపారుల వద్ద వసూలు చేసిన డబ్బుకు రశీదులు రాస్తున్నారా? రాసి ఉంటే చూపాలని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత 6 నెలల్లో చీమకుర్తి మున్సిపాలిటీలో అభివృద్ధి పని ఒక్కటి కూడా లేదని, బ్లీచింగ్ చల్లించడం, వీధి లైట్ల ఏర్పాటు, మరమ్మతులనే మరిచారన్నారు. పన్నుల రూపంలో వచ్చిన డబ్బులు ఏమి చేస్తున్నారో తెలియడం లేదంటూ కమిషనర్ తీరును దుయ్యబట్టారు. సమావేశానికి అధికారులు ఎందుకు రావడం లేదని ప్రశ్నించగా మౌనమే సమాధానమైంది. పాలకవర్గానికి ముందస్తు సమాచారం ఇచ్చి పనులు చేపడితేనే సహకరిస్తామని కౌన్సిలర్లు తేల్చిచెప్పారు. అనంతరం మున్సిపల్ సమావేశంలో 21 అంశాలతో పెట్టిన అజెండాను రద్దు చేస్తున్నట్లు పాలకవర్గ సభ్యులు స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

టీడీపీకి కొమ్ము కాస్తున్న అధికారులు

మున్సిపల్ కమిషనర్‌తో పాటు కార్యాలయంలోని కొందరు అధికారులు, సిబ్బంది టీడీపీ నాయకులకు కొమ్ముకాస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ఎస్.మాణిక్యంతో పాటు కౌన్సిలర్లు ఆరోపించారు. మున్సిపల్ సమావేశం అనంతరం చైర్‌పర్సన్ చాంబర్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌తోపాటు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు చల్లా అంకులు, భీమన వెంకట్రావు, తప్పెట బాబూరావు, పాటిబండ్ల గంగయ్య, పత్తి కోటేశ్వరరావు, సోమా శేషాద్రి బడే పద్మ, కంజుల ప్రతాప్‌రెడ్డి, గంగిరెడ్డి ఇందిర, ఆముదాలపల్లి ప్రమీల, మేకల సులోచన, షేక్ ఖాజా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చైర్‌పర్సన్‌తో కలిపి 20కి 18 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఉంటే కమిషనర్, అధికారులు కనీస గౌరవం లేకుండా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. తమ అనుమతి లేకుండా అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలతో అజెండా తయారు చేయడాన్ని తప్పుబట్టారు. తాము పట్టణ అభివృద్ధికి సహకరిస్తామే తప్ప అడ్డుకునే వాళ్లం కాదని స్పష్టం చేశారు.

టిప్పర్ ఢీకొని యువకుడు దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరామ్

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): బైక్‌ను వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కనిగిరి మండల పరిధిలోని గార్లపేట రోడ్డులో మెగా బేస్ క్యాంప్ ఎదురు మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మర్రిపూడి మండలం గార్లపేటకు చెందిన గుడిపాటి రామిరెడ్డి(35) కనిగిరి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గార్లపేట సమీపంలోని మెగా బేస్ క్యాంప్ వద్ద వెనుక నుంచి వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. బైక్ నుంచి ఎగిరిపడిన రామిరెడ్డి మీదుగా టిప్పర్ వెళ్లడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని కనిగిరి పోలీసులు పరిశీలించారు. మృతునికి భార్య నాగమణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీరామ్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

హనుమంతునిపాడు: తోటలో కోసిన నిమ్మకాయలు విక్రయించేందుకు వెళ్తుండగా బైక్ అదుపుతప్పడంతో ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన హనుమంతునిపాడు మండల పరిధిలోని ఎలికవారిపల్లి క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎలికవారిపల్లి గ్రామానికి చెందిన రైతులు పగడాల చెన్నకేశవులు, వంట్రా నారాయణ తమ తోటలో కోసిన నిమ్మకాయల మూటను బైక్‌పై హనుమంతునిపాడులోని కమీషన్ షాపు వద్దకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి పల్టీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అదే మార్గంలో వెళ్తున్న వారి సాయంతో కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి

యర్రగొండపాలెం: మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి చేసిన సంఘటన స్థానిక అయ్యప్ప నగర్‌లో సోమవారం రాత్రి జరిగింది. త్రిపురాంతకం మండలం మిట్టపాలేనికి చెందిన మల్లయ్య, లక్ష్మి దంపతులు పనుల కోసం యర్రగొండపాలెంలో నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లిన మల్లయ్యను లక్ష్మి వారించింది. దీంతో వారిద్దరి మధ్య కాసేపు ఘర్షణ జరిగింది. మల్లయ్య కత్తి తీసుకొని ఆమె మెడపై, చేతులపై తీవ్రంగా గాయపరిచాడని పోలీసులు తెలిపారు. గాయాలపాలైన ఆమె స్థానిక వైద్యశాలలో చికిత్స పొందుతోంది. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

ఆస్తి కోసం అంత్యక్రియల అడ్డగింత



వెంకయ్య(ఫైల్)

టంగుటూరు: ఆస్తిని కుమార్తెకు రాసిచ్చాడని తండ్రి అంత్యక్రియలను కుమారుడు, కోడలు అడ్డుకున్నారు. ఆస్తిని తమకూ పంచాలని అడ్డు తగలడంతో ఉదయం జరగాల్సిన అంత్యక్రియలు ఇరుకుపొరుగు సాయంతో సాయంత్రానికి జరిగాయి. ఈ సంఘటన ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. కాకుటూరివారిపాలేనికి చెందిన తొట్టెంపూడి వెంకయ్య (85)కు ఇద్దరు కుమారులు, కుమార్తె. పెద్ద కుమారుడు తొట్టెంపూడి వెంకటశేషయ్య హైదరాబాద్‌లో ఉంటుండగా గత ఏడాది మృతిచెందాడు. రెండో కుమారుడు వెంకటేశ్వర్లు గ్రామంలోనే వ్యవసాయం చేస్తుంటాడు. కుమార్తె చిలుకూరి సత్యవతిని కొన్నేళ్ల కిందట వివాహం చేసి పంపగా వారూ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వెంకయ్యకు వృద్ధాప్యం, తల్లి లక్ష్మమ్మకు పక్షవాతం కావడంతో కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో కుమార్తె వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం వెంకయ్య మృతి చెందాడు. సొంత గ్రామంలో తండ్రి దహనసంస్కారాలు చేయాలని కుమార్తె కుటుంబసభ్యులతో సోమవారం తీసుకువచ్చారు.

మృతదేహం ఎదుటే వాగ్వాదం

సొంత గ్రామంలో అంత్యక్రియలు చేసేందుకు సోమవారం మృతదేహాన్ని తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలు చేపట్టేందుకు బంధువులకు సమాచారం కూడా ఇచ్చారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలు చేసేందుకు సిద్ధం చేస్తుండగా పెద్ద కోడలు విజయలక్ష్మి, చిన్న కుమారుడు వెంకటేశ్వర్లు ఆస్తి పంపకాలపై లేవనెత్తారు. దీంతో మృతదేహం ఎదుటే రెండూ కుటుంబాలు వాగ్వాదానికి దిగారు. తండ్రిపై ఉన్న పొలం, ఇతర ఆస్తులను కుమార్తె తమకు తెలియకుండా అక్రమంగా రాయించుకుందని కుమారుడు, కోడలు బంధువుల ముందు ఆరోపించారు తల్లిదండ్రులను సరిగ్గా పట్టించుకోకపోవడంతోనే తన వద్ద ఉంటున్నారని, వారి వైద్యం కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేశానని ఆమె బంధువర్గాల ముందు చెప్పుకొచ్చారు. ఇద్దరి వాదనలపై స్థానిక గ్రామస్తులు విస్తుపోయారు. తండ్రి మృతి చెంది మూడు రోజులైందని, అంత్యక్రియలు ఆలస్యం కాకూడదని ఇరుగుపొరుగువారు సర్ది చెప్పడంతో సాయంత్రానికి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ




క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు అర్బన్: నూతన సంవత్సరం నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యాలయంలో పట్టణ శాఖ క్యాలెండర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి వరకుమార్, కోశాధికారి భాను, సహాధ్యక్షుడు మసూద్ అలీ, పట్టణ అధ్యక్షులు రంగారెడ్డి, కార్యదర్శి మోటా శ్రీను, ఒంగోలు తాలూకా అధ్యక్షుడు సురేష్‌బాబు, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, రామ్మోహనరావు, గోపికృష్ణ, శ్రీదేవి, యేసురత్నం, శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

మేదరమెట్ల: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-12 బాలుర క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలోని రావినూతల క్రికెట్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఎంపికలో 16 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించారు. వీరిలో బీ.లోకేష్ (కెప్టెన్), ఎం.గగన్ (వైస్ కెప్టెన్), ఎం.వర్షిత్ (వికెట్ కీపర్), ఎస్.కమల్ సంజీవ్ (వికెట్ కీపర్), కే.సూరజ్, పీ.ప్రణీత్, బీ.అఖిలేష్, అబ్దుల్ అజీమ్, కే.మనుశ్రీ, బీ.రాజ, ఎస్‌కే.ఉస్మాన్, షేక్ మొహిద్, ఎస్‌కే.మొసిల్, వీ.మనీష్, టీ.సుశాంతేజ్, కే.తారకరామను ఎంపిక చేశారు. స్టాండ్ బైగా యూ.వెంకట వశిష్ఠ, యూ.రోహన్ శివసాయ్, బీ.విక్కీ, కే.జశ్వంత్ మొత్తం 20 మంది క్రీడాకారులను ఎంపికచేశారు. ఎంపికైన జట్టు సభ్యులు ఈనెల 9న విజయవాడలో నిర్వహించే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొననున్నట్లు కోచ్ తెలిపారు.

జాతీయ స్థాయి ఖోఖో ప్రాబబుల్స్ ఎంపిక



ఎంపిక చేసిన రాష్ట్ర ఖోఖో పురుషుల జట్టు

జే.పంగులూరు: జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టును పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపిక చేశారు. ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 37 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ తరఫున పరిశీలకుడు నెల్లూరు డీఎస్‌డీఓ ఆర్కే యతిరాజు, ప్రకాశం జిల్లా ఖోఖో కోచ్ డీఎల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బి.కాశీవిశ్వనాథ్‌రెడ్డి, గుంటూరు జిల్లా ట్రెజరర్ ఎం.వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా ఖోఖో అసోసియేషన్ ట్రెజరర్ కె.హనుమంతురావు, రైల్వే జాతీయ క్రీడాకారుడు కె.శ్రీనివాసరావు పాల్గొని అత్యున్నత ప్రతిభ చూపిన క్రీడాకారులు 25 మందితో ప్రాబబుల్స్ జట్టును ఎంపిక చేశారు. వీరికి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పంగులూరు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో 25 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పీడీ మేకల సీతారామిరెడ్డి తెలిపారు. తుది జట్టు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలో నిర్వహించనున్న 28వ జాతీయ క్రీడల్లో పాల్గొంటుందని చెప్పారు.

రావినూతలతో అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు

- ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభం
- పాల్గొననున్న వివిధ రాష్ట్రాల జట్లు
- మొదటి బహుమతి రూ.3 లక్షలు

మేదరమెట్ల: మకర సంక్రాంతిని పురస్కరించుకుని కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలోని రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 31వ అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు ఈనెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గతంలో మాదిరిగానే ఈ పోటీలు 20-20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీల్లో గెలుపొందిన మొదటి జట్టుకు రూ.3 లక్షలు, రెండో జట్టుకు రూ.2 లక్షలు, మూడో జట్టుకు రూ.1 లక్ష నగదు బహుమతులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బెస్ట్ బ్యాటర్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఫీల్డర్లకు కూడా బహుమతులు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని, పోటీలు నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీలను భ్రమర సంక్రాంతి కప్ పేరుతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు (బాబు), కార్యదర్శి మోపర్తి శేషారావు, రామినేని శ్రీనివాసరావు, కారుసాల సుబ్బారావు, మోపర్తి లక్ష్మీనారాయణ, చేబ్రోలు నాగేశ్వరరావు పాల్గొన్నారు.